

మెదక్ I సంగారెడ్డి I సిద్దిపేట
వార్త

## సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో 25న మెగా జాబ్ మేళా

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా 'సిద్దిపేట పోలీస్ ఉద్యోగ మిత్ర పేరిట భారీ మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళా ఏప్రిల్ 25న, సిద్దిపేటలోని పోలీస్ కన్వెన్షన్ సెంటర్ (ఇందుర్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో)లో ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవు తుందని, ఈ కార్యక్రమానికి 10వ తరగతి, ఐటీఐ, ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్ ఇతర వృత్తి విద్యా పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులన్నారు. మెగా జాబ్ మేళాలో ఐటీ, ఫార్మసీ, ఇండస్ట్రీ తదితర రంగాలకు చెందిన పలు ప్రముఖ సంస్థలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయని, ఆసక్తి గల అభ్యర్థులు తమ వెంట విద్యార్హత ధృవపత్రాల జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు కనీసం 5 రెజ్యూమ్ కాపీలతో హాజరు కావాలని సూచించారు. యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తుకు బాటలువేసుకోవాలని సీపీ కోరారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, సామాజిక బాధ్యతగా యువతకు ఉపాధి కల్పించే దిశగా పోలీస్ శాఖ ఉద్యోగ మిత్ర చేపడుతోందని తెలిపారు.

## 25న మంత్రి వివేక్ వెంకటస్వామి నర్సాపూర్ రాక

**నర్సాపూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :**

ఈ నెల 25వ తేదీన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి నర్సాపూర్ పట్టణానికి వస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకట్‌స్వామి నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పర్యటిస్తారని తెలిపారు. ప్రభుత్వం నుంచి నర్సాపూర్ మున్సిపాలిటీకి వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.15 కోట్ల నిధులు మంజూరైనందున. అట్టి అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి చేతులమీదుగా శంకుస్థాపనలు చేయనున్నారని తెలిపారు.

అదేవిధంగా నర్సాపూర్ పట్టణంలో మంజూరైన కళ్యాణలక్ష్మి ,, షాదిముబారక్ పథకాల సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారని నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి వివరించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారుజ



సిద్దిపేట ఆర్టీసి డిపో ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

## రెండో రోజూ కొనసాగిన ఆర్టీసి కార్మికుల సమ్మె

### ఇబ్బందులు పడుతున్న ప్రయాణీకులు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

ఆర్టీసి కార్మికులు జిల్లా వ్యాప్తంగా చేపట్టిన సమ్మెతో రెండో రోజు గురువారం బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్-ప్రెజ్ఞాపూర్, దుబ్బాక డిపోలలో ఆర్టీసి కార్మికులు మంగళవారం అర్థరాత్రి నుంచి ఆర్టీసి జెఏసి పిలుపు మేరకు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే!. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆయా డిపోల ఎదుట కార్మికులు ఆందోళనలు చేపట్టారు. బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ప్రయాణీకులకు తిప్పలు తప్పడం లేదు. అద్దె, ఎలక్ట్రిక్ బస్సులు నడిచినప్పటికీ ప్రయాణీకుల ఇబ్బందులు మాత్రం తప్పలేదు. తప్పని పరిస్థితుల్లో ప్రయాణీకులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలోని ఆయా డిపోల వద్ద సమ్మె సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్టీసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలని ఆర్టీసి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేస్తూ జిల్లాలో ఆయా డిపోల ఎదుట మహా ధర్నాలు నిర్వహించారు.

## ఆర్టీసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

### సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు



కార్మికులతో కలిసి సమ్మె ధర్నాలో పాల్గొన్న చుక్కా రాములు

**జహీరాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** ఆర్టీసి కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్టీసి డిపో ఎదుట సమ్మె చేస్తున్న కార్మికులకు మద్దతు ప్రకటిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్కా రాములు మాట్లాడుతూ సమ్మెను పరిష్కరించకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరికాదన్నారు. ఆర్టీసిలో వేతనాల సవరణ చేయకపోవడంతో కార్మికులు ఆర్థికంగా అవస్థలు పడాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆర్టీసి కార్మికులకు చేసిన హామీలను నెరవేర్చే దిశగా చర్చలు జరిపి సమ్మె ఆగిపోయేలా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బరం మల్లేష్, సహాయ కార్యదర్శి మహిపాల్, నాయకులు నరేష్, కిరణ్, బాల్‌రాజ్, సాయిగౌడ్, ఆర్టీసి కార్మికులు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బిఆర్ఎస్ మద్దతు : ఎమ్మెల్యే



ఆర్టీసి కార్మికుల ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** ఆర్టీసి కార్మికుల సమ్మెకు బిఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు అన్నారు. ఆర్టీసి బస్టాండు ఎదుట సమ్మె చేస్తున్న కార్మికులకు మద్దతుగా ఎమ్మెల్యే ధర్నాలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసి కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ క్యాబినెట్ తీర్మానం చేసి రాష్ట్రపతికి పంపించడం జరిగిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా ఆర్టీసి కార్మికులకు చేసిన హామీలను రెండేళ్ల గడుస్తున్నా అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. హైదరాబాద్‌లో ఆర్టీసిని ప్రైవేట్ పరం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని మండిపడ్డారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.గుండప్ప, జహీరాబాద్, కోహీర్ మండలాల బిఆర్ఎస్ అధ్యక్షులు తట్టు నారాయణ, నర్సింలు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బండి మోహన్, పట్టణ మాజీ అధ్యక్షుడు యాకూబ్, మున్సిపల్ కౌన్సిలర్లు గౌస్ గౌరీ, దీపక్, విశ్వేశ్వర్, ప్రవీణ్, సర్పంచ్‌లు మచ్చేందర్, మోహన్‌రాథోడ్, భీమ్‌రావునాయక్, బాల్‌రాజ్, దేశెట్టి పాటిల్, ఆర్టీసి జేఏసి నాయకులు హనుమయ్య, మాణిక్, ఆర్టీసి కార్మికులు పాల్గొన్నారు.

## పరిశ్రమల ఏర్పాటుతో ఉద్యోగావకాశాలు

### -ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**ములుగు, ఏప్రిల్ 23 (ప్రభాతవార్త):** రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ములుగు మండల పరిధిలోని తునికిబొల్లారం గ్రామ సమీపంలో గల పారిశ్రామిక వాడలో నూతనంగా ఏర్పాటుచేసిన ఆజాద్ ఇంజనీరింగ్ లిమిటెడ్ మరియు ఇన్నోవేషన్ సెంటర్‌ను గురువారం కంపెనీ ప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం కంపెనీల ఏర్పాటుకు కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తూ పరిశ్రమలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు.



పరిశ్రమ ప్రారంభోత్సవానికి వస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

## ధాన్యం ఆరబెట్టిన తరువాతే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**నంగునూరు/చిన్నకోడూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త**

ధాన్యాన్ని వ్యవసాయ క్షేత్రాల వద్ద తేమ శాతం తగ్గేవరకు ఆరబెట్టిన తరువాతే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి రైతులకు విజ్ఞప్తి చేశారు. గురువారం నంగునూరు మండలం పాలమాకుల, చిన్నకోడూరు మండలం గోనెపల్లి, పెద్దకోడూరు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు వరి కోత చేసిన వెంటనే కేంద్రాలకు తీసుకురాకుండా, ముందుగా పొలాల వద్ద తేమ శాతం తగ్గే వరకు బాగా ఆరబెట్టాలని, తేమశాతం సరైన స్థాయికి చేరినతర్వాతే ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావడం వల్ల నష్టాలు తగ్గుతాయన్నారు. అలాగే కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, తేమ శాతం కొలిచే యంత్రాలు, కంతాలు, పాడి క్లీనర్లు వంటి అవసరమైన సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. అకాల వర్షాలు పడే అవకాశం ఉన్నందున ధాన్యం తడవకుండా టార్పాలిన్ షీట్లు అందుబాటులో ఉంచాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో ధాన్యంపై టార్పాలిన్ కవర్లు కప్పాలని రైతులకు సూచించారు. కేంద్రాలకు కేటాయించిన మిల్లుల్లో ధాన్యం దిగుమతిలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే కొనుగోలు కేంద్ర సిబ్బంది వివరాలను ప్రతి రైతుకు చేరేలా అవగాహన కల్పించాలని సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

### ఎన్‌సీడీ స్క్రీనింగ్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఎన్‌సీడీ (అసంక్రమిత వ్యాధులు) స్క్రీనింగ్‌ను పగడ్బందీగా నిర్వహించాలంటూ జిల్లా కలెక్టర్ హైమావతి వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు నిర్వహించిన స్క్రీనింగ్‌లో నిర్లక్ష్యం చోటు చేసుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఐడీఓసి సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఏఎన్ఎంలతో కలెక్టర్ చర్చించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఎన్‌సీడీ స్క్రీనింగ్ కీలకమని, ప్రతి వ్యక్తికి వ్యక్తిగత హెల్త్ ప్రొఫైల్ సిద్ధం చేయడమే లక్ష్యమని తెలిపారు. బీపీ, షుగర్‌తోపాటు ఓరల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ వంటి వ్యాధుల గుర్తింపునకు ఈ పరీక్షలు ఉపయోగపడతాయని చెప్పారు. గుర్తించిన రోగులకు సమయానికి వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిదేనని స్పష్టం చేశారు. ఇప్పటివరకు నిర్వహణలో లోపాలు ఉన్నాయని పేర్కొంటూ, రేపటి నుంచి అన్ని పీహెచ్సీల పరిధిలో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి 30 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి స్క్రీనింగ్ చేయాలని ఆదేశించారు. సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న సిద్దిపేట ఏసిపి రవీందర్‌రెడ్డి

## గ్రామాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

### సిద్దిపేట ఏసిపి రవీందర్‌రెడ్డి

**చిన్నకోడూరు, ఏప్రిల్‌న 23, ప్రభాతవార్త :** గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని సిద్దిపేట ఏసిపి రవీందర్‌రెడ్డి సూచించారు. చిన్నకోడూరులోని పోలీసు స్టేషన్‌లో గురువారం సీసీ కెమెరాల ఏర్పాటుపై ఎస్ఐ చంద్రమోహన్ అధ్యక్షతన ప్రజాప్రతినిధులు, యువకులతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, యువకులు ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసుతో సమానంగా పని చేస్తుందన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు పూర్తిగా తగ్గుముఖం పడుతాయన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ వెంకట్, సర్పంచ్‌లు ధర్మాజిపేట తిరుపతిరెడ్డి, వాసుదేవాచారి, గాలిపల్లి అనిల్, గంగా పర్శరాములు, పొన్నాల సత్తయ్య, నాయకులు ములకల కుంటయ్య, బొల్లం చంద్రం, హరీష్, వేణు, ఉప సర్పంచ్ కన్నారెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

### -ఏసిపి నర్సింలు

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 23 (ప్రభాతవార్త):** సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా 'సిద్దిపేట పోలీస్ ఉద్యోగ మిత్ర' పేరిట భారీ మెగా జాబ్ మేళాను ఈనెల 25వ తేదీ ఉదయం 9 గంటలకు సిద్దిపేట పోలీస్ కన్వెన్షన్ సెంటర్ ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో నిర్వహించడం జరుగుతుందని గజ్వేల్ డివిజన్ ఏసిపి నర్సింలు ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి, ఐటిఐ, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్ మరియు ఇతర వృత్తి విద్యా కోర్సులు పూర్తిచేసిన వారు అర్హులని తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాలో ఐటి, ఫార్మసీ, ఇండస్ట్రీ, వివిధ కంపెనీలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేస్తాయని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు, రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులు తమ వెంట విద్యార్హత ధృవపత్రాల జిరాక్స్ కాపీలు, పాస్‌ఫోటోలు, కనీసం 5 రెజ్యూమ్ కాపీలతో హాజరు కావాలని పేర్కొన్నారు.

## గోవుల అక్రమ రవాణాను అడ్డుకున్న యువకులు

**చౌటకూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** నాందేడ్ అకోలా 161వ జాతీయ రహదారిపై అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తున్న గోవులను భజరంగ్‌దళ్ యువకులు అడ్డుకుని 22 గోవుల ప్రాణాన్ని కాపాడారు. అర్ధరాత్రి మండల పరిధిలోని తాడ్‌దాన్‌పల్లి టోల్ ప్లాజా వద్ద డీసీఎం, మహేంద్రా వాహనాల్లో 22 గోమాతలను వాహనాల్లో అక్రమంగా తరలిస్తుండగా పోలీసుల సహకారంతో యువకులు అక్రమ రవాణాకు అడ్డుకట్టవేశారు. 22 గోవులను జోగిపేటలోని శ్రీకృష్ణ గశాలకు తరలించి సంరక్షించారు. నారాయణఖేడ్ ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు వాహనాల్లో అక్రంగా గోమాతలను తరలిస్తున్నట్లు భజరంగదళ్ యువకులకు సమాచారం అందడంతో విషయాన్ని పుల్‌కల్ పోలీసులకు సమాచారం అందించి వారి సహకారంతో గోవులను అక్రమ రావాణాను అడ్డుకట్టవేశారు. గోవులను తరలిస్తున్న రెండు వాహనాలను స్వాధీనంలోకి తీసుకుని వాహనాల డ్రైవర్లు, క్లీనర్‌లపై, వాహన యజమానులపై కేసులు నమోదు చేసినట్లు సిఐ అనిల్‌కుమార్, ఎస్ఐ విశ్వజన్‌లు తెలిపారు.

## ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

### మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

**పాపన్నపేట, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులసమంజసమైన డిమాండ్లను పరిష్కరించకపోగా వారిని ఆందోళన చేసే విధంగా ఉసిగొలిపిందని ఆయన విమర్శించారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ,ఆర్టీసి కార్మికుల సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలని ఆయన డిమాండ్ చేశారు..

## రెండో రోజుకు చేరిన ఆర్టీసీ కార్మికుల ఆందోళన

### భారీ బందోబస్తు నడుమ బస్సుల రాకపోకలు

### ఆందోళనకారుల నిర్బంధం..

**మెదక్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** మెదక్ జిల్లాలో కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తమ కోర్కెల సాధన కోసం కార్మికులు పట్టుబడుతుండటంతో, ప్రజలకు రవాణా ఇబ్బందులు కలగకుండా యంత్రాంగం ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా మెదక్ బస్టాండ్ నుండి సుమారు 30 బస్సులను రెవెన్యూ, పోలీసు విభాగాల కట్టుదిట్టమైన భద్రత మధ్య వివిధ మార్గాల్లోకి పంపించారు. ప్రయాణికులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా రవాణా శాఖ అన్ని ఏర్పాట్లు చేసిందని, వివిధ ప్రభుత్వ విభాగాల సమన్వయంతో సేవలు అందిస్తున్నామని సంస్థ ప్రాంతీయ అధికారిణి సురేఖ తెలిపారు. మరోవైపు ఆందోళనలో పాల్గొంటున్న కార్మికులను పోలీసులు అడ్డుకుని, వారిని అదుపులోకి తీసుకుని పాపన్నపేట పోలీసు కార్యాలయానికి తరలించారు. ఈ తరుణంలో సమ్మెకు సంఘీభావం తెలిపేందుకు భారతీయ జనతా పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గుల్షన్ క్లబ్ నుండి మెదక్ బస్టాండ్ వరకు ప్రదర్శనగా వస్తున్న కార్మికులను, నాయకులను పోలీసులు నిలిపివేయడంతో ఇరువర్గాల మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. అనంతరం పోలీసులు వారిని అరెస్టు చేశారు. ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మిక సంఘాలను పునరుద్ధరించాలని ఆందోళనకారులు ప్రధానంగా డిమాండ్ చేశారు. వీటితో పాటు 2021 మరియు 2025 సంవత్సరాలకు సంబంధించిన వేతన సవరణలను ప్రకటించాలని, ఇతర పెండింగ్ కోర్కెలను తక్షణమే పరిష్కరించాలని వారు నినదించారు. ఈ నిరసన కార్యక్రమంలో గడ్డం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, యువమోర్చా జిల్లా అధ్యక్షులు సతీష్ పటేల్, ఎంఎల్ఎన్ రెడ్డి, కాశీనాద్, నాయకులు సాయిబాబా, బబ్లు, కిరణ్, రమేష్ మరియు సీఐటీయూ నాయకులు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## బస్టాండ్‌లో కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు

### ఆర్టీసీ సేవలు అంతరాయం లేకుండా కొనసాగాలి

### మెదక్ ఎస్‌పి శ్రీనివాసరావు

**మెదక్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :**

టీజీఎస్ఆర్టీసీ జేఏసీ సమ్మె నేపథ్యంలో మెదక్ జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తమైంది. ప్రజా రవాణా సేవలు నిరంతరంగా కొనసాగేందుకు భద్రతా చర్యలను బలోపేతం చేసింది. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. డిపో మేనేజర్ సురేఖతో మాట్లాడిన ఎస్పీ, ప్రస్తుతం నడుస్తున్న బస్సుల సంఖ్య, సేవల స్థితిగతులను తెలుసుకున్నారు. సమ్మె ఉన్నప్పటికీ ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా రవాణా సేవలు సజావుగా కొనసాగేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బస్టాండ్ పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రైవేట్ డ్రైవర్లు, సిబ్బంది భయపడాల్సిన అవసరం లేదని, వారికి పూర్తి భద్రత కల్పిస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు. ప్రజా రవాణాకు ఆటంకం కలిగించే చర్యలు, బస్సులకు నష్టం, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసాన్ని సహించబోమని హెచ్చరించారు. అటువంటి ఘటనలు జరిగితే సంబంధితులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు సహకరించాలని, అనుమానాస్పద కదలికలు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ వెంట డియస్పీ ప్రసన్న కుమార్, డిపో మేనేజర్ సురేఖ, సీఐలు మహేష్, సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు

**అల్లాదుర్గం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు మెరుగైన సౌకర్యాలు లభిస్తున్నాయని ఎంపి ఓ గంగాధర్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కిషోర్ లు అన్నారు. అల్లాదుర్గం ఎస్సీ బాలుర వసతి గృహంలో గురువారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వసతి గృహంలో అందిస్తున్న సౌకర్యాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థులకు విద్యా ,ఆరోగ్య, క్రమశిక్షణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. హాస్టల్లో విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను మరికొంత మందికి వివరించి ఇప్పుడున్న విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అందరూ సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ప్రభాకర్, హాస్టల్ సిబ్బంది నీలి శివయ్య, తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గోదా సమేత లక్ష్మీవెంకటేశ్వర స్వామి వార్షికోత్సవ వేడుకలు

**పెద్దశంకరంపేట, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని గోదా సమేత లక్ష్మివెంకటేశ్వరస్వామి వార్షికోత్సవ వేడుకలు 24వ తేదీ నుండి రెండు రోజులపాటు జరగనున్నాయి. వేడుకలకు ఆలయాన్ని రంగురంగుల దీపాలతో ముస్తాబు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా 24వ తేదీశుక్రవారం గణపతి పూజ, పుణ్యా వచనం, నవగ్రహవాస్తు, మూల మంత్ర హోమము, 25వ తేదీ శనివారం అభిషేకాలు, గోదా సమేత లక్ష్మీ వెంకటేశాయ స్వామి కళ్యాణోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయం ధర్మకర్త విగ్రా శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. స్వామివారి కల్యాణోత్సవ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించాలని పేర్కొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యం పట్టివేత

**గుమ్మడిదల ఏప్రిల్ 23 ప్రభాతవార్త :** గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో టోల్‌గేట్‌వద్ద విజిలెన్స్ అధికారులు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. సమాచారం మేరకు రెండు ఆటోలలో కంటోన్మెంట్ బియ్యం(రేషన్ బియ్యం) తరలిస్తున్నట్లు గుర్తించి వాటిని తనిఖీ చేయగా 59 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు తేలింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, మొత్తం 118 ప్రభుత్వ సంచుల్లో బియ్యం నిల్వ ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఆ రెండు ఆటోలను సీజ్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఈ బియ్యాన్ని డిటీఎస్‌సీ సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ వీరేశంకు అప్పగించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రజలకు సరఫరా చేయాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించడం తీవ్రమైన నేరమని హెచ్చరించారు. ఇలాంటి చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటో లను పట్టుకున అధికారులు

## బైక్‌ను ఢీ కొట్టిన లారీ

### కూతురు మృతి తండ్రికి తీవ్ర గాయలు

**కొండపాక, ఏప్రిల్ 23,ప్రభాతవార్త :** మండలపరిధిలోని రాజీవ్ రహదారిపై హోటల్ వన్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి చెందగా తండ్రికి తీవ్ర గాయలయ్యాయి. కుకునూర్‌పల్లి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. బెజ్జంకి మండలం ముత్తన్నపేట గ్రామానికి చెందిన బొర్ర రాజు(45) కూతురు సాన్విత(9) కుకునూర్ మండల పరిధిలోని ఎల్లాయిగూడలో ఉన్న విజయలక్ష్మీ మెమోరియల్ స్టోన్ బ్రిడ్జి స్కూల్‌లో 3వ తరగతి చదువుతుందని తెలిపారు. పాఠశాల పని దినాలకు చివరి రోజు కావడంతో తండ్రి రాజు కూతురును తీసుకొని వస్తున్న క్రమంలో హోటల్ వన్ వద్ద లారీ డ్రైవర్ వేగంగా వచ్చి వెనుకనుంచి బైక్‌ను ఢీ కొట్టడంతో సాన్విత(9) తలకు బలమైన గాయలై అక్కడికక్కడే మృతి చెందగా తండ్రి రాజుకు తీవ్ర గాయలు కావడండో చికిత్స సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. రాజు భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి

**నర్సాపూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** ప్రమాదవశాత్తును కరెంట్ షాక్ తగిలి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన నర్సాపూర్ మండలం ఎల్లాపూర్ గ్రామంలో గురువారం జరిగికుంది. ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డి కథనం ప్రకారం... ఎల్లాపూర్ గ్రామానికి చెందిన మన్నె శ్రీధర్(38) వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే గురువారం ఉదయం పొలానికి వెళ్ళొస్తానని చెప్పి వెళ్లాడు. పొలానికి నీరు పెడుదామన్నా క్రమంలో బోర్ మోటర్ చెడిపోయింది. మన్నె శ్రీధర్ బోర్‌ను మరమ్మతులు చేస్తున్న క్రమంలో షాక్ తగిలి స్పృహ తప్పి పడిపోయాడు. సమాచారం తెలుసుకున్న భార్య పేరు ఉమా కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి వచ్చి స్పృహ కోల్పోయి ఉన్న శ్రీధర్‌ను వెంటనే నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే అతడు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య ఉమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్ కుమార్‌రెడ్డి తెలిపారు. బాగా మృతుడికి భార్య ఉమా ఇద్దరు మగ పిల్లలు ఉన్నట్లు తెలిపారు.

## దాడి చేసిన వారిపై కేసు నమోదు

**శివ్వంపేట, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :** కంపెనీ సిబ్బందిపై దాడి చేసిన వారిపై కేసు చేయడం జరిగిందని ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... మండలంలోని నవాబ్‌పేట గ్రామ శివారులోని ఫ్లెమింగ్ కంపెనీలోనికి అకారణంగా నవాబ్‌పేట గ్రామానికి చెందిన నల్ల హరి గౌడ్, నల్ల రవి గౌడ్, రాంపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, రాంపల్లి పాపిరెడ్డి, ఎండి ముస్తఫా, భోగి నరసింగరావు, సురకంటి మల్లారెడ్డి, పబ్బ సాయిరాం, ఏనుగు నరేందర్ రెడ్డి, సురకట్టి దశరథ్ రెడ్డి మరియు మరి కొంతమంది కలిసి అక్రమంగా ప్రవేశించి అక్కడ ఉన్న సెక్యూరిటీ సూపర్వైజర్ ఎస్ కే సింగ్, రాజేంద్రప్రసాద్‌లను బూతు మాటలు తిట్టి ఇట్టి స్థలం నుండి ఖాళీ చేయాలని కొట్టి దాడి చేసి ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. ఈ ఘటనపై ఫ్లెమింగ్ కంపెనీ హెచ్ ఆర్ మేనేజర్ మనోహర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

## కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

### జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

**చేర్యాల, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు కాంగ్రెస్ కక్ష పూరిత రాజకీయానికి చెంపపెట్టు అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూళిమిట్ట మండలాలకు చెందిన లబ్ధిదారులకు సిఎం ఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం అంటే ఒక మేడిగడ్డ కాదు, వందల కిలోమీటర్ల టన్నెల్, వందల మోటార్ పంపులు, మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల ప్రాజెక్టుల సమాహారమే కాళేశ్వరమేనన్నారు. 88 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ ప్రాజెక్టుకు అయిన ఖర్చు నాలుగు వేల కోట్లు మాత్రమేనని తెలిపారు. రేవంత్‌రెడ్డి గోదావరిజలాలను మూసిలో పోస్తానాని చెబుతున్న నీళ్ల కాళేశ్వరం ప్రాజెక్టులోనివేనని, కేసీఆర్, జీవన్‌రెడ్డి కలయికలో హైకోర్టు తీర్పు మొదటి విజయమన్నారు. పీసీ గోష్ కమిషన్ నివేదిక పేరుతో కేసీఆర్, హరీష్‌రావులను దోషులుగా నిర్ణయించారు. ఎలాంటి విచారణ లేకుండా ఘోష్ కమిషన్ కేసీఆర్, హరీష్‌రావు, అధికారులపై దోషులుగా చూపిద్దామని ప్రయత్నం చేశారన్నారు. అందుకే ఎలాంటి ప్రొసీజర్ లేకుండా రిపోర్ట్ ఇచ్చారని, దురుద్దేశపూర్వకంగా ఆరోపణలు చేశారని హైకోర్టు ఘోష్ కమిషన్ నివేదికను కొట్టివేసిందన్నారు. మేడి గడ్డ పనికిరాదని చెప్పిన రేవంత్ రెడ్డి కూలిపోయిన బ్రిడ్జిపైనే కదా తన కాన్వాయ్ పోయిందని, ఒక పిల్లర్‌కు పగుళ్ల వస్తే మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యంగా బూటకపు ప్రచారం చేశారన్నారు. హైకోర్టు తీర్పుతో కేసీఆర్, హరీష్‌రావులు కడిగిన ముత్యంలా బయటకు వచ్చారని తెలిపారు. మరోసారి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై అసత్య ఆరోపణలు చేస్తే ప్రజలే చెప్పుతో కొడతారని చెప్పారు.



మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

**బెల్ట్ షాపులు మూసివేయాలి...**

బెల్ట్‌షాపుల వల్ల పేద కుటుంబాలు దోపిడీకి గురవుతున్నారన్నారు. బెల్ట్ షాపులతో పేదలు ఆగమవుతున్న విషయాన్ని మేధావులు, యువత గుర్తించి, బంద్ చేయించేందుకు తోడ్పడలన్నారు. ఈ కార్యక్రమంలో చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ ముస్త్యాల అరుణ, చైర్‌పర్సన్ మేడిశెట్టి ఉమాశ్రీధర్, మాజీ ఎంపిపి ఉల్లంపల్లి కర్ణాకర్, మద్దూరు మాజీ ఎంపిపి బద్దిపడగ కృష్ణారెడ్డి, ముస్త్యాల నాగేశ్వర్ రావు, వెంకట్‌రెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

## శ్రీలక్ష్మీనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలలో పాల్గొంటున్న ప్రజలు

**కొండాపూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
కొండాపూర్ మండల పరిధిలోని మారేపల్లి గ్రామంలో శ్రీలక్ష్మీనారాయణ స్వామివారి 9వ బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీవైకుంఠపురం ప్రధాన అర్చకులు కందాడై వర్ధాచార్యుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ మహోత్సవాలు వైభవంగా కొనసాగనున్నాయి. గురువారం నుంచి ఐదు రోజులపాటు జరిగే ఈబ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజూ ప్రత్యేకపూజలు, వాహన సేవలు, హోమాలు నిర్వహించబడతాయి. అదనంగా భక్తులను ఆకట్టుకునే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఆలయ పూజారులు మాట్లాడుతూ, భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి వారి దర్శనం చేసుకొని ఆశీస్సులు, తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ పూజారులు కోరారు. కార్యక్రమం విజయవంతం కావడానికి గ్రామస్థులు విస్తృత ఏర్పాట్లు చేశారు.

## శివాలయ నిర్మాణానికి భూమి పూజ



శివాలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

**కొండపాక, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
కుకునూరుపల్లి మండల పరిధిలోని తిప్పారంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, గ్రామ సర్పంచి అకుల భద్రప్ప ఆధ్వర్యంలో గురువారం శివాలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీమ్కుంద మఠం సోమలింగశివాచార్యమహాస్వామిజీ చేతులమీదుగా భూమి పూజ నిర్వహించారు. గ్రామంలో శివాలయం నిర్మిస్తున్నందుకు లింగాయత్ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జంగమ గురువులు, కుకునూరుపల్లి మండల లింగాయత్ అధ్యక్షుడు, గౌరవ అధ్యక్షులు, తిప్పారం గౌరవ అధ్యక్షులు, శివాలయం గుడి నిర్మాణ సభ్యులు, లింగాయత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వాసవీమాత జయంతిని ప్రభుత్వపండగలా నిర్వహించడం అభినందనీయం

**-ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి**

**నారాయణఖేడ్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
ఆర్యవైశ్య కులదైవమైన వాసవీమాత జయంతిని ప్రభుత్వపండగలా అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేపట్టనివిధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వాసవీమాత జయంతిని ప్రభుత్వ పండగలా నిర్వహించేవిధంగా జీవో విడుదల చేయడం గొప్పవిషయం అన్నారు. అందుకు కృషిచేసిన ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాతను కూడా ఆయన అభినందించారు. సంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షులు మునిగాల మాణిక్‌ప్రభుగుప్త, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ కోటగిరి సతీష్, ఖేడ్ పట్టణ అధ్యక్షులు దారం క్రిష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి వీరేశలింగం, కోశాధికారి నగేష్, వాసవిక్లబ్ అధ్యక్షులు సాయి బాబా, అవోపా అధ్యక్షులు కోటగిరి సత్యనారాయణ, మండల అధ్యక్షులు ఆత్మకూరి రాజు, వాసవిక్లబ్ మాజీ డిప్యూటీ గవర్నర్ భూషణం, సాయి, తదితరులు ఈసందర్భంగా ఆనందం వ్యక్తంచేశారు.

## వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి అధికారికం

**-ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు**



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షనీయమని ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వాసవి మహాసంస్థాన్ చైర్మన్ తోపాజి అనంతకిషన్ తెలిపారు. వాసవి మహాసంస్థాన్ పాలకవర్గ సమావేశం గురువారం ఆర్యవైశ్య భవనంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 26వ తేదీన ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి క్షీరాభిషేకం జరుగుతుందని, అనంతరం కలెక్టర్ కార్యాలయం వరకు బైక్‌ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. కలెక్టర్ కార్యాలయం ఆడిటోరియంలో అధికారికంగా నిర్వహించి వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి కార్యక్రమంలో ఆర్యవైశ్యులు ప్రజలు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఈల్లింతల రాజు, కోశాధికారి జూలకంటి మల్లేశం, కార్య నిర్వాహక కార్యదర్శి కొంపల్లి విద్యాసాగర్, ఉపాధ్యక్షుడు ఆమెటి మహేందర్ సభ్యులు పాల్గొన్నారు.

## బిస్లరీ యాజమాన్యం మొండివైఖరి విడనాడాలి

**-సిఐటియు రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మానిక్**

**పటాన్‌చెరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
బిస్లరీ యాజమాన్యం మొండివైఖరి విడనాడాలని కార్మికుల బదిలీలను ఆపాలని, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పరిశ్రమలు, కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అతిమేల మానిక్ డిమాండ్ చేశారు. గురువారం పాశమైలారం పారిశ్రామిక వాడలోని బిస్లరీ ఇంటర్నేషనల్ పరిశ్రమ ముందు కార్మికులు ఆందోళనచేశారు. ఈసందర్భంగా మాణిక్ మాట్లాడుతూ.. బిస్లరీ యాజమాన్యం కార్మికుల వ్యతిరేక విధానాలకు పాల్పడుతు చర్చలపేరుతో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. కార్మికులను ట్రాన్స్‌ఫర్‌చేసి వేధింపులకు పాల్పడుతుందని అన్నారు. యాజమాన్యం యూనియన్‌తో చర్చలు జరిపి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో కార్మికులపక్షాన ఆందోళన తీవ్రతరం చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు రాజు, యూనియన్ జనరల్ సెక్రెటరీ శేఖర్‌రెడ్డి, నాయకులు నాగరాజు, నవీన్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

## పేపర్ బాయ్స్‌కు జగ్గారెడ్డి సైకిళ్ల పంపిణీ

**సంగారెడ్డి బ్యూరో, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
సంగారెడ్డి పట్టణంలో పత్రికలపంపిణీ ద్వారా ఉపాధిపొందుతున్న బాలురకు మద్దతుగా టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ముందుకు వచ్చారు. సంగారెడ్డి, మల్కాపూర్ ప్రాంతాల్లో వివిధపత్రికలకు ఏజెంట్లుగా పనిచేస్తున్న 27మంది పేపర్‌బాయ్స్‌కు గురువారం సైకిళ్లను పంపిణీచేశారు. పత్రికలు వేయడానికి సైకిళ్లు అవసరమని జగ్గారెడ్డి కార్యాలయాన్ని సంప్రతించిన ఈబాలుర అభ్యర్థనపై స్పందించిన ఆయన, తక్షణమే సాయం అందించారు. చదువుకుంటూ పేపర్ పంపిణీచేస్తూ ఉపాధిపొందుతున్నవారితోపాటు, చదువు మధ్యలోమానేసి జీవనోపాధికోసం పనిచేస్తున్న బాలురూ ఇందులో ఉన్నారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ, చదువు మానేసినవారికి ఆసక్తి ఉంటే పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. సైకిళ్లకోసం ఇప్పటికే మరో 500మంది స్కూల్ విద్యార్థులు నమోదు చేసుకున్నారని, వారికి విడతలవారీగా సైకిళ్లను పంపిణీచేయాలని అధికారులకు ఈ సందర్భంగా జగ్గారెడ్డి సూచించారు.

# ఆర్‌టీసీ సమ్మెకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే




కార్మికుల పక్షాన నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**నారాయణఖేడ్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌టీసీ ఉద్యోగులకు చేస్తున్న సమ్మెకుమద్దతుగా నారాయణఖేడ్ మాజీ శాసన సభ్యులు మహారెడ్డి భూపాల్‌రెడ్డి సంఘీభావం తెలియజేశారు. మాజీఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్టీసీ ఉద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చి ఎన్నికల్లో వారి ఓట్లను వాడుకొని రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా వారికి ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా వారు చర్చలకు వస్తామన్నా వారిని పిలవకపోగా, వారు సమ్మెకు పిలుపునిస్తే సమ్మె జరగకుండా పోలీసులను పెట్టి వారిపై కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులకు మద్దతుగా బీఆర్‌ఎస్‌పార్టీ అండగా ఉంటుందని, వారి హామీలు నెరవేర్చే వరకు వారివెంటే ఉంటామని తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి నర్సింహారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పరమేష్, పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్, మాజీ సర్పంచులు రాజునాయక్, రవీందర్‌నాయక్, ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

**కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు చెంపపెట్టు...**
**-మహారెడ్డి భూపాల్‌రెడ్డి**

కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని ఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం నారాయణఖేడ్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కాంగ్రెస్ నేతలు కాళేశ్వరం ప్రాజెక్టును కూలేశ్వరం ప్రాజెక్టు అని ఎగతాళిచేసి కెసిఆర్‌పైన, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావుపైన లేనిపోని ఆరోపణలు చేసి రెండున్నర సంవత్సరాలు పబ్బంగడిపారని విమర్శించారు. హైకోర్టు తీర్పు వారికి చెంపపెట్టు అని తెలియజేశారు. ఇకనైనా కాంగ్రెస్ పార్టీ నాయకులు తేరుకొని కుంగిన రెండు పిల్లర్‌లను రిపేరు చేసి కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగించి రైతులకు నీటిని అందించి ఆదుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు పరమేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ నజీబ్, వైస్ చైర్మన్ పరశురాం, పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్, సర్పంచులు వెంకటేశం, గణపతి, మోహన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ విటల్, మాజీసర్పంచులు రాజునాయక్, రవీందర్‌నాయక్, ఉపసర్పంచి శంకర్ తదితరులు ఉన్నారు.

## సదాశివపేట పాఠశాలలకు మహర్దశ

**-అదనపు తరగతి గదులతో నూతన రూపు**




పాఠశాలను పరిశీలిస్తున్న నాయకులు

**సదాశివపేట, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
సదాశివపేట ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లాలన్న లక్ష్యంతో సదాశివపేట పట్టణంలో విద్యా వసతుల అభివృద్ధికి కీలక చర్యలు ప్రారంభమయ్యాయి. టిజిఐఐసి చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సూచనలమేరకు మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, జిల్లా విద్యాధికారి శ్రీనివాసరాజుతో కలిసి పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను పరిశీలించారు. ఈ అభివృద్ధి పనులకు సంబంధించిన అంచనా వ్యయ వివరాలను కలెక్టర్‌కు పంపినట్లు జిల్లా విద్యాధికారి వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, జిల్లా విద్యాధికారి శ్రీనివాసరాజు, ఏఈ ప్రవీణ్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, సిడిసి చైర్మన్ రామిరెడ్డి, తుల్జారాం, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## హరీష్‌రావును అభినందించిన ఆదర్శ్‌రెడ్డి



డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్‌రావును అభినందిస్తున్న ఆదర్శ్‌రెడ్డి

**రామచంద్రాపురం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
కాళేశ్వరం ప్రాజెక్టుపై హై కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో గురువారం మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్‌రావును పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్‌ఎస్ ఇంచార్జి వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి నియోజకవర్గ నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందించారు. ఈసందర్భంగా బిఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు తీర్పు రాజకీయ కక్షసాధింపులకు తగురీతిలో సమాధానం చెప్పినట్లయిందన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు నియోజకవ్గ బిఆర్‌ఎస్ ఇంచార్జి వెన్నవరం ఆదర్శ్ రెడ్డి, పటాన్‌చెరు, రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్‌లు మెట్టు కుమార్ యాదవ్, తొంట అంజయ్య, పటాన్‌చెరు, జిన్నారం మండలాల మాజీ జడ్పిటిసి సభ్యులు శ్రీకాంత్‌గౌడ్, కొలను బాల్‌రెడ్డి, బిఆర్‌ఎస్ నాయకులు జిన్నారం వెంకటేష్‌గౌడ్, పృథ్వీరాజ్, సాయిచరణ్‌గౌడ్, మాణిక్‌యాదవ్, జగన్నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులకు సన్మానం



ఫీల్డ్ అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులను సన్మానిస్తున్న జడ్పిసిఈఓ

**హత్నూర, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
ఉపాధిహామీ పథకంలో ఎక్కువమంది కూలీలకు ఉపాధిపని కల్పించి మండలంలో అగ్రస్థానంలో నిలిచిన హత్నూర మండలం నవాబుపేట ఫీల్డ్ అసిస్టెంట్ కె.శేఖర్, పంచాయతీ కార్యదర్శి సాయికిరణ్‌లను సంగారెడ్డి జిల్లా జడ్పి సిఈవో జానకిరెడ్డి శాలువాలతో సన్మానించారు. గురువారం మండలంలో పర్యటించిన ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులను సన్మానించారు. కార్యక్రమంలో హత్నూర ఎంపిడివో శంకర్, ఎంపిఓ, ఎండి, యూసుఫ్, ఎపిఎం ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

## కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి

**-ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.ఎ.రెహమాన్**




సమ్మెకు మద్దతు తెలుపుతున్న ఎఐటియుసి నాయకులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
ఆర్టీసీ కార్మికుల రెండోరోజు సమ్మెలోభాగంగా నేడు సంగారెడ్డిడిపో ఎదురుగా జరిగిన ఆర్టీసీ కార్మికుల ఆందోళనకు సిపిఐ, ఎఐటియుసి నాయకులు మద్దతు తెలిపారు. ఎన్నికలసందర్భంగా ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.ఎ.రెహమాన్, మహబూబ్‌ఖాన్, శివ శంకర్, లక్ష్మి, దళితహక్కుల పోరాటసమితి జిల్లా కన్వీనర్ గడ్డం కిరణ్ కుమార్‌తోపాటు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు విక్రమ్‌కుమార్ వందలాది మంది ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**కొండపాక, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
కొండపాక మండల పరిధిలోని దర్గా, రాంపల్లి, గిరాయిపల్లి, రవీంద్రనగర్, గ్రామాల్లో గురువారం ఐకెపి అధ్వర్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ అధ్యక్షుడు విరుపాక శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించి ధ్యానం విక్రయించి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం రైతుల కోసం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యం విక్రహించాలని కోరారు. కార్యక్రమంలో ఎఎంసి వైస్ చైర్మన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వాసరి లింగరావు, అయా గ్రామాల సర్పంచులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**కొండపాక, ఏప్రిల్ 23. ప్రభాతవార్త:**
కుకునూరుపల్లి మండల క్లస్టర్‌లో కుకునూరుపల్లిలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మాదవి అధ్వర్యలో గురువారం గ్రాద్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 6 సంవత్సరాల వయస్సుల గల పిల్లలకు ఆట పాటల ద్వారా విద్యను అందించడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడి కేంద్రాల్లో ప్రీ స్కూల్ విద్యను అందించడం జరుగుతుందని అమె తెలిపారు. అలాగే పోషణ పాక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. సెల్ ఫోన్ చూడడం ద్వారా పిల్లల జరిగే నష్టలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దండి సుజాత, ఎంపిడిఒ రాంప్రసాద్, ఎంఈఒ బచ్చలి సత్తయ్య, అంగన్‌వాడీ టీచర్లు, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసిన దృశ్యం

**గజ్వేల్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
గజ్వేల్‌మండలం కొడకండ్లగ్రామ ప్రాథమికపాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మధునాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థినీవిద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మధునాల శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఉదయం, సాయంత్రం మాత్రమే బయటకువెళ్లి ఆడుకోవాలని, మధ్యాహ్నం ఇంట్లోనే ఉండాలని తెలిపారు. అనంతరం పాఠశాలలో వివిధ పండుగలు, జాతీయ పర్వదినాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి లక్ష్మీకొండయ్య, గ్రామకార్యదర్శి స్వామి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ కళ్యాణి, ఉపాధ్యాయులు రహేళ్ల, కల్పన, సాధన తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

**-బిఆర్‌ఎస్ పార్టీ కోఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆదర్శరెడ్డి

**పటాన్‌చెరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
కాళేశ్వరం ప్రాజెక్టుపైన హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని పటాన్‌చెరు నియోజకవర్గ బిఆర్‌ఎస్ పార్టీ కో ఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి అన్నారు. గురువారం పటాన్‌చెరు పట్టణంలో బిఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆదర్శ్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పిసి ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు స్టే విధిస్తూ, ఆ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశించడం జరిగిందని తెలిపారు. ఆ నివేదిక నిజానిజాలను ప్రతిబింబించకుండా రాజకీయ ఉద్దేశాలతో రూపొందించబడిందని విమర్శించారు. గత మూడు సంవత్సరాలుగా కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై చేసిన ఆరోపణలు న్యాయస్థానం ముందు బట్టబయలయ్యాయని అన్నారు. రైతులకు నీరు అందించాల్సిన ప్రభుత్వం ప్రాజెక్ట్‌ను నిర్లక్ష్యం చేసి ఇబ్బందులకు గురిచేసిందని పేర్కొన్నారు. ఇకనైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజకీయాలు పక్కనపెట్టి రైతులకు క్షమాపణచెప్పాలని డిమాండ్‌చేశారు. ఈసమావేశంలో పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మాజీ జడ్పిటిసిలు గడీల శ్రీకాంత్ గౌడ్, కొలన్ బాల్‌రెడ్డి, రామచంద్రాపురం మాజీకార్పొరేటర్ తొంట అంజయ్య యాదవ్, కౌన్సిలర్లు నవీన్‌కుమార్, సురేష్, సతీష్, రవీందర్, మాజీ కౌన్సిలర్ రవీందర్‌రెడ్డి, బిఆర్‌ఎస్ యువనాయకులు పృథ్వీరాజ్, మాణిక్‌యాదవ్, రామచంద్రాపురం బిఆర్‌ఎస్ సర్కిల్ ప్రెసిడెంట్ పరమేష్‌యాదవ్, డివిజన్ ప్రెసిడెంట్ బూన్, బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ప్రకాశ్‌చారి, జగన్నాథ్ రెడ్డి, గణేష్, మాజీసర్పంచి ఖాదిర్ తదితరులు పాల్గొన్నారు.

## రామాయంపేటలో ఘనంగా భగీరథ జయంతి

**-సగర సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, భారీర్యాలీ**

**రామాయంపేట, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
మహర్షి భగీరథ జయంతిని పురస్కరించుకొని రామాయంపేటలో సగర సంఘం ఆధ్వర్యంలో గురువారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చిత్తారమ్మ దేవాలయం ఆవరణలో భగీరథుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సన్నాయిమేళంతో పట్టణంలో భారీర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సగరసంఘం నాయకులు మాట్లాడుతూ భగీరథుని త్యాగం, దీక్ష తరతరాలకు ఆదర్శం అన్నారు. భగీరథుని ఆశయాలను కొనసాగిస్తూ సమాజసేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సగర సంఘం అధ్యక్షులు మర్కు అజేష్ సగర, మర్కు భూపాల్ సగర, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మర్కు దత్తు సగర, జిల్లా ప్రధాన కార్యదర్శి మర్కు నగేష్ సగరతో పాటు సంఘం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**రామాయంపేట మున్సిపాలిటీలో...**
మహర్షి భగీరథుని జయంతిసందర్భంగా రామాయంపేట మున్సిపాలిటీలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్యానాగరాజు ముఖ్యఅతిథిగా హాజరై, భగీరథుని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ పోచమ్మల నవనీతగణేష్, కౌన్సిలర్‌లు గజవాడ నాగరాజు, పుట్టి సందీప్, శంకర్‌గౌడ్, దేవుని రంజిత్, మద్దెల మాధవిరమేష్, దాకి శ్యామలస్వామి, మున్సిపల్ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు చింతల స్వామి, చిలుక విరాట్, సుధీర్‌గౌడ్, దేవుని నరేష్, పోచమ్మల భాను, నరేందర్, నాగేంద్ర, గణేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

**అల్లాదుర్గంలో...**

**అల్లాదుర్గం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
మహర్షి భగీరథ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాలని సగరసంఘం మెదక్ జిల్లా మాజీ అధ్యక్షులు సాయికుమార్ అన్నారు. మహర్షి జయంతి పురస్కరించుకొని సగరసంఘం నాయకులు రెడ్డిపల్లి, అప్పాజీపల్లి, వెంకట్రావుపేట్ గ్రామాల్లో సగరసంఘం ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో భగీరథ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సగరసంఘం నాయకులు, అధ్యక్షులు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## నత్నాయపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంబించిన సర్పంచి ఉదయ్‌కుమార్

**నర్సాపూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండలపరిధిలోని నత్నాయపల్లిగ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఈ కొనుగోలు కేంద్రాన్ని గ్రామ సర్పంచి అందూరి ఉదయ్‌కుమార్ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర లభించేందుకు ఈ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులందరూ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి ఉదయ్‌కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచి తోట ఎల్లం, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుదర్శన్, ప్రెసిడెంట్ కుశన్నగారి అశోక్, వార్డు సభ్యులు సత్యనారాయణ, మమత, దర్శన్, రాజేష్, వీరేష్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్రగతిపత్రాలు అందజేత

**వెల్దుర్తి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం పాఠశాల చివరిరోజు కావడంతో విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కంప్యూటర్ ఆపరేటర్లకు హెల్మెట్ల పంపిణీ

**మునిపల్లి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
మునిపల్లి మండలం అల్లాపూర్ గ్రామ సర్పంచ్ నారాయణ మండల పరిషత్ కర్యాలయంలో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు హెల్మెట్లు అందజేయడం జరిగింది. వాహనాలు డ్రైవింగ్ చేసేటప్పుడు హెల్మెట్ ధరించాలని, తగు జాగ్రత్తలు తీసుకొని ప్రజలందరూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ సురక్షితతంగా ఉండాలని సర్పంచి నారాయణ సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ అంజయ్య, ఎంపిఓ అండాలమ్మ, ఎపిడి, ఎపిఒ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

## మహిళల భద్రత సామాజిక బాధ్యత

**-సైకాలజీ అధ్యాపకురాలు డాక్టర్ అఫ్రిన్ వసీం**

**పటాన్‌చెరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
మహిళలు భయంలేకుండా స్వేచ్ఛగా జీవించగల వాతావారణాన్ని సృష్టించడానికి సామూహికంగా బాధ్యత వహించాలని గీతంలోని అప్లైడ్ సైకాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అఫ్రిన్ వసీం అభిప్రాయపడ్డారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ పరిశోధన చర్చలశ్రేణిలో భాగంగా ఐదవ సెమినార్‌ను గురువారం నిర్వహించింది. ఈ చర్చాగోష్ఠిలో అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. సమకాలీన భారతదేశంలో లింగం, భద్రత, మానసిక శ్రేయస్సుపై విమర్శనాత్మక ఆలోచనను ప్రోత్సహిస్తూ, ఆసక్తికరమైన చర్చతో ఈ సమావేశం ముగిసింది.

## అంతరించిపోతున్న గుట్టలు

**-అడ్డుకోని అధికారులు**



గుట్టలను తవ్వేస్తున్న దృశ్యం

**మొగుడంపల్లి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని గుట్టలను అక్రమార్కులు అక్రమ తవ్వకాలతో అంతరించిపోయేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా పెద్ద పెద్ద గుట్టలను దర్జాగా తవ్వేస్తూ అక్రమ సంపాదిస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే... మండల పరిధిలోని పలు గ్రామాల్లో రైతుల వ్యవసాయ భూములకు ఆనుకుని ఉన్న అటవీ, ప్రభుత్వ భూముల్లో ఉన్న గుట్టలను తమ వ్యవసాయ భూముల్లోకి కబ్జా చేసుకునేందుకు గుట్టలను తవ్వేస్తూ కబ్జాకు పాల్పడుతున్నారు. గుట్టల తవ్వకాలతో విలువైన వృక్షసంపద నేలబారుతూ పర్యావరణ వినాశనానికి దారితీస్తోంది. కొందరు మొరం కోసం గుట్టలను తొలగిస్తూ యథేచ్ఛగా మట్టిని వాడేసుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రమైన మొగుడంపల్లి, మండలంలోని మన్నాపూర్, గోపన్‌పల్లి, గౌసాబాద్, ఖాంజమాల్‌పూర్, జాడిమల్కాపూర్, గుడుపల్లి తదితర గ్రామాల్లో గుట్టలు పూర్తిగా నేలబారాయి. పగలు, రాత్రి తేడాలేకుండా గుట్టలను తవ్వేస్తున్నా మైనింగ్ అధికారులు కాని, రెవిన్యూ అధికారులు కాని అటువైపు కన్నెత్తి చూడకపోవడం పట్ల ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఈవిషయమై తగుచర్యలు తీసుకోవాలని మండల ప్రజలు సూచిస్తున్నారు.



హార్టికల్చర్ యూనివర్సిటీలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

## హార్టికల్చర్ యూనివర్సిటీలో విద్యార్థుల నిరసన

**ములుగు, ఏప్రిల్ 23 (ప్రభాతవార్త):** శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీలో గురువారం పిజి,పిహెచ్‌డి విద్యార్థులు సీట్ల కేటాయింపుపై నిరసన వ్యక్తం చేశారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీలో 30 బిఎస్సీ హార్టికల్చర్ సీట్లు, 8 ఎంఎస్సీ సీట్లు కేటాయించనున్నట్లు వచ్చిన సమాచారంపై విద్యార్థులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హార్టికల్చర్ కోర్సులు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న యూనివర్సిటీ ఉండగా, మరో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఇదే కోర్సులకు సీట్లు కేటాయించడం సరైన నిర్ణయంకాదని వారు పేర్కొన్నారు. ఈ చర్య వల్ల హార్టికల్చర్ యూనివర్సిటీ ప్రాముఖ్యత దెబ్బతింటుందని, విద్యార్థుల అవకాశాలు తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లోగా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని విద్యార్థి నాయకులు హెచ్చరించారు. హార్టికల్చర్ విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించి, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సముచిత నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు.

## మే డేను జయప్రదం చేయాలి : సందబోయిన ఎల్లయ్య



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య

**గజ్వేల్, ఏప్రిల్ 23 (ప్రభాతవార్త):** అంతర్జాతీయ కార్మికుల హక్కుల దీక్షా దినం మే డేను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య పిలుపునిచ్చారు. గురువారం గజ్వేల్‌లోని సిఐటియు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పని గంటల తగ్గింపు కోసం పోరాటంలో పుట్టిన జెండా ఎర్ర జెండా అని, శ్రమజీవులు ఉన్నంత కాలం ఎర్ర జెండా ఉంటుందన్నారు. మే డేరోజున గ్రామ గ్రామాన ఎర్ర జెండాను ఎగురవేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, యాదగిరి, కనకయ్య, బాబు, కనకవ్వ, నర్సింలు, ఐలయ్య పాల్గొన్నారు.

## వెల్కటూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పూజల హరికృష్ణ

అర్బన్ మండలంలోని వెల్కటూర్ గ్రామంలో వడ్ల కొనుగోలు ఐకేపీ కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూజల హరికృష్ణ గురువారం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన చివరి గింజవరకు రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, రైతును రాజుగా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఐకేపీ కేంద్రాల్లో రైతుల కోసం నీడ, తాగునీటి సదుపాయాలు కల్పించి, పారదర్శకంగా వడ్ల కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొల్లు లక్ష్మి, నరేష్, ఏఈఓ రాజేష్, వార్డ్‌సభ్యులు, కాంగ్రెస్‌నాయకులు వెంకటేష్ గౌడ్, మల్లమరి శంకర్, రాజు, శ్రీకాంత్, శ్రీధర్, బాలనర్సు యాదగిరి, బత్తిని అరుణ, మధులత, అర్బన్ మండల అధ్యక్షుడు బిక్షపతి, బొమ్మల యాదగిరి, దాస అంజన్న, మార్క సతీష్, డీసీసీ మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, పూజల గోపికృష్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్లు బస్సా వంశీ, పవన్, ఏఎంసీ డైరెక్టర్లు ఎర్ర మహేందర్, వాహబ్, ఎల్లు శ్రీనివాస్ రెడ్డి, ఏరాబోలు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే

## ఉద్యమం ఉధృతం చేస్తాం : మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్



మాట్లాడుతున్న వొడితల సతీష్‌కుమార్

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** రెండు రోజుల్లో ఆర్టీసీ సమస్యలు పరిష్కారం కాకుంటే కార్మికులతో కలిసి ఉద్యమం ఉధృతం చేస్తామని మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ హెచ్చరించారు. గురువారం హుస్నాబాద్ బస్‌డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిననాటినుంచి ప్రభుత్వంగా తన బాధ్యతను పూర్తిగా విస్మరించిందని, ట్రాన్స్‌పోర్ట్ శాఖను మంత్రిగా ఉన్న పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి పేరును చెప్పుకుని బాధ్యత తప్పించుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడబోయిన తిరుపతిరెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధులు సుద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జున రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎం.ఏ. అన్వర్ పాషా, సీనియర్ నాయకులు వంగ వెంకట్రామ్ రెడ్డి, బండి రమణ రెడ్డి, కన్నోజు రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

**గజ్వేల్, ఏప్రిల్ 23 (ప్రభాతవార్త):** గజ్వేల్ సెక్టార్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ 1వ అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఓ సరిత, సూపర్వైజర్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ సరిత మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు మంచి పౌష్టికాహారం, ప్రీస్కూల్ విద్యతో పాటు చిన్నారులకు ఆటలు, పాటలు నేర్పించడం జరుగుతుందన్నారు. మూడు సంవత్సరాల పిల్లలను తప్పకుండా స్థానికంగా ఉండే అంగన్వాడీ కేంద్రాలలో పేరు నమోదు చేయించుకోవాలన్నారు. చిన్నారులను అంగన్వాడీ కేంద్రాలకు పంపిస్తే వారి జ్ఞాపకశక్తి మెరుగుపడడంతో పాటు చదువులో మంచిగా రాణిస్తారన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అంగన్వాడీ కేంద్రాలలోని చిన్నారులకు పౌష్టికాహారం, విద్యతో పాటు ఆట వస్తులను అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రజ్ఞాపూర్‌లోని ఐదు అంగన్వాడీ కేంద్రాల్లో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న చిన్నారులకు ప్రొగ్రెస్ కార్డులను అందజేసి ప్రాథమిక పాఠశాలలకు పంపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రామలక్ష్మి, బాలమణి, రజిత, ఫర్జానా, నాగరాణి, కవిత, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల నిజం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### మెదక్ జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్పర్సన్ సుహాసినిరెడ్డి



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో సుహాసిని రెడ్డి

**నర్సాపూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** పేదల సొంతింటి కలను సాకారం చేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం అని మెదక్ జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్పర్సన్ చిలుముల సుహాసినిరెడ్డి అన్నారు గురువారం నర్సాపూర్ మండల పరిధిలోని ఆవంచ, తుల్జారాంపేట పంచాయతీలలో ఇందిరమ్మ ఇల్లు మంజూరై పూర్తి చేసిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిలుముల సుహాసినిరెడ్డి హాజరై ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. ఆవంచ, తుల్జారాంపేట్ గ్రామపంచాయతీలలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకం కింద మంజూరైనా లబ్దిదారులు లొంక మంజుల, లొంక లావణ్య, లౌద్యా రాజు, అనితల ఇళ్లను సుహాసిని రెడ్డి ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు ఇన్ని రోజులుగా ఏ ప్రభుత్వం పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన కొన్ని రోజుల్లోనే ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి పేదల సొంతింటి కల నెరవేరుస్తుందన్నారు పేదల సొంతింటి కలను నిజం చేస్తూ, వారి ముఖాల్లో చిరునవ్వులు నింపడం ఎంతో సంతోషాన్నిచ్చింది అని పేర్కొన్నారు. ప్రతీ పేదవాడికి ఆత్మగౌరవంతో కూడిన నివాసం ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అనంతరం లబ్ధిదారులకు బహుమతులను అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ సుహాసినిరెడ్డి రాకతో లబ్ధిదారులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హుస్సేన్, డిఈ, నాయకులు, తిరుపతి రెడ్డి, గ్రామ అధ్యక్షులు మన్నె శ్రీను, సర్పంచ్ స్రవంతి కరుణాకర్, తుల్జారాంపేట్ సర్పంచ్ కవిత కిషన్ నాయక్ ఉప సర్పంచ్ చిగురు కిష్టయ్య, ఉప సర్పంచ్ కిషన్, రవి, చందర్, వార్డ్ మెంబర్లు, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీశైలంయాదవ్, మన్నె వెంకటేష్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు లొంక అంజమ్మ, జగంపేట రవీందర్ లొంక సుధాకర్ రాజపేట శ్రీరాములు, రాజీపేట బిక్షపతి కొత్త యాదగిరి కుమ్మరి సత్తయ్య, లొంక చందు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు



రాయపోల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**రాయపోల్, ఏప్రిల్ 23 (ప్రభాతవార్త):** ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడిఏ బాబునాయక్, ఎంపిడివో శ్రీనివాస్, ఏపిఎం యాదగిరి అన్నారు. గురువారం రాయపోల్ మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గ్రామ సర్పంచులతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో రాయపోల్ సర్పంచ్ మాసంపల్లి రాజు, తిమ్మక్కపల్లి సర్పంచ్ అశోక్‌రెడ్డి, మంతూర్ సర్పంచ్ పర్వీజ్ హైమద్, రాయపోల్ సెక్రటరీ శివకుమార్, ఉపసర్పంచ్ రాజు, నాయకులు కిష్టారెడ్డి, రాజిరెడ్డి, ఐకెపి సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

### వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని
## రాష్ట్ర పండుగగా ప్రకటించడం హర్షణీయం : రాజమౌళి

**గజ్వేల్, ఏప్రిల్ 23 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం అహింసామూర్తి వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతిని అధికారికంగా రాష్ట్రపండుగగా ప్రకటించడం హర్షించదగ్గ విషయమని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి. రాజమౌళి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వైశాఖ శుక్లపక్ష దశమి నాడు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వమే అధికారికంగా జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు ప్రకటించడం పట్ల ఆర్యవైశ్య సంఘం తరపున స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 26న వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలను గజ్వేల్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అలాగే ఆర్యవైశ్య సమాజంలో ఉన్న నిరుపేదలను ప్రభుత్వం ప్రత్యేకంగా ఆదుకోవాలని, నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్య కోసం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కార్పొరేషన్ ద్వారా నిరుపేదలకు తక్కువ వడ్డీ రుణాలు మంజూరుచేసి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పుస్తెలు, మెట్టెలు బహూకరుణ

**బెజ్జంకి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** కరీంనగర్ డైరీ ఆధ్వర్యంలో గురువారం నూతన వదువు వివాహానిమిత్తం పుస్తెలు, మెట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బెజ్జంకి పాల డైరీ అధ్యక్షులు ఎలిగే సతీష్, డైరెక్టర్ దుమాల మహేష్, సూపర్‌వైజర్ ధను, బండారి రాములు, సీతలక్ష్మణ్ పాల్గొన్నారు.

## ఫీజు రీయంబర్స్‌మెంటు నిధులు విడుదల చేయాలి

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** విద్యార్థులకు ఉచితంగా ఉన్నత విద్యను అందించాలనే సదుద్దేశంతో తీసుకొచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ఎత్తివేసేందుకు కుట్రపన్నుతుందని ఎబివిపి రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు సావుల అదిత్య అన్నారు. ఎబివిపి ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ఫీజు రియంబర్స్‌మెంటు బకాయిల విడుదలకై కరపత్రం విడుదల చేసి ఉద్యమ కార్యచరణ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రియంబర్స్‌మెంటు పథకంలో ప్రతి యేటా 14 లక్షల మంది విద్యార్థులు ఆధారపడి చదువుకుంటున్నారని తెలిపారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని లేనియెడల పెద్దఎత్తున్న ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హాస్టల్స్ కో-కన్వీనర్ పవన్, నగర కార్యదర్శి, రాష్ట్ర వనవాసి కో-కన్వీనర్ పరశురాం, నగర ఉపాధ్యక్షులు లోకేష్, కృష్ణ, హాస్టల్ కో-కన్వీనర్ తరుణ్, కళాశాల కార్యదర్శి కార్తీక్, మహిళా కార్యదర్శి భారతి, అక్షయ, అమూల్య, భాను, విద్యార్థులు పాల్గొన్నారు.





కరపత్రాన్ని విడుదల చేస్తున్న బిజెపి నాయకులు



ముత్యాల తలంబ్రాలను అందజేస్తున్న రామకోటి రామరాజు

## ఎర్రవల్లిలో భద్రాచల తలంబ్రాల పంపిణీ

**మర్కుక్, ఏప్రిల్ 23 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలో గురువారం భద్రాచల సీతారాముల కళ్యాణ ముత్యాల తలంబ్రాలను పంపిణీ చేశారు. హనుమాన్ దేవాలయంలో శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపకుడు, భక్తిరత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు భజనల మధ్య తలంబ్రాల విశిష్టతను వివరించి భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచల కళ్యాణానికి 300 కిలోల గోటి తలంబ్రాలు సమర్పించామని, భక్తుల కోసం 100 కిలోల ముత్యాల తలంబ్రాలు తీసుకు వచ్చినట్లు తెలిపారు. అనంతరం స్థానిక సర్పంచ్ కవిత రామోహన్‌రెడ్డి మాట్లాడుతూ భద్రాచల తలంబ్రాలు అందుకోవడం తమ అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. భక్తులు రామరాజు సేవలను కొనియాడుతూ ఘనంగా సన్మానించారు. ప్రతి సంవత్సరం ఇలాంటి అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి

**మర్కుక్, ఏప్రిల్ 23 (ప్రభాతవార్త):** విద్యా సంవత్సరం ముగింపు సందర్భంగా మండల పరిధిలోని పాములపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయుడు లతీసైదా ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో అమలవుతున్న పిఎంశ్రీ కార్యక్రమాలపై తల్లిదండ్రులకు వివరించారు. రాబోయే విద్యా సంవత్సరంలో కల్పించనున్న ప్రత్యేక వసతులను తెలిపారు. అనంతరం విద్యార్థుల ప్రగతి పత్రాలను విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో అందజేసి, ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని, ఎండ తాపం నుంచి రక్షణ చర్యలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చౌడుతండాలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

**అక్కన్నపేట, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** అక్కన్నపేట మండలం కొప్టెన్ చౌడు తండాలో గుగులోతు రమేష్ ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో ఈ ఇల్లు మంజూరై, పేద కుటుంబానికి కొత్త ఆశలు నింపింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ స్వరూప రాజునాయక్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు పేదలకు వరంగా మారాయని, పేదల కళ్లలో ఆనందం కనిపించడం ఎంతో సంతోషకరమని అన్నారు. గ్రామంలో అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేయించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయరాం, అక్కన్నపేట సర్పంచ్ సంపత్, హౌసింగ్ ఏఈ ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంతరావు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు భూక్య శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎం, సిఐటియు, బిజెపి నేతల అరెస్ట్

**వెల్దుర్తి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు గురువారం మెదక్‌లో జరుగుతున్న కార్మికుల సమ్మెకు సిపిఎం జిల్లా కార్యదర్శి నరసమ్మ, సిఐటియు జిల్లాకార్యదర్శి మల్లేశం, బిజెపి నాయకులు గడ్డం శ్రీనివాస్, ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతు పలికారు. దీంతో మెదక్‌లో వారిని అరెస్టు చేసి వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇన్సూరెన్స్ స్పందించి న్యాయం చేయాలని ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని వారన్నారు.



వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో నాయకులు

# ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

### ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, ఏప్రిల్ 23 (ప్రభాతవార్త):** ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తుంగలో తొక్కిందని ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి విమర్శించారు. గురువారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో వద్ద కార్మికులు చేపడుతున్న సమ్మె రెండోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మెకు సంఘీభావం తెలిపిన వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులను రేవంత్‌రెడ్డి అధికార బలంతో పోలీసులను అడ్డుపెట్టుకొని పోలీసు పహారాతో వారు వేసుకున్న టెంట్‌లను తీసివేసి ఆర్టీసీ కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. శాంతియుతంగా చేస్తున్న సమ్మెను అడ్డుకోవడం ఆర్టీసీ కార్మికుల హక్కులను కాలరాయడమే అని విమర్శించారు. ఉచిత బస్సు అని గొప్పలు చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత రెండున్నర సంవత్సరాలుగా ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ఒక్కో బస్సులో వంద మందికి పైగా ప్రయాణీకులను ఎక్కించుకొని గమ్య స్థానాలకు సురక్షితంగా చేరుస్తున్నారని చెప్పారు. ఆర్టీసీకార్మికులపై పోలీసు లాఠీలను ఝులిపించడం, కార్మికులను అక్రమంగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమన్నారు. కార్మికులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం పొడుగెల్లలేదని, ప్రజాపాలన అంటే శాంతియుతంగా సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికుల టెంట్‌లు తీసివేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడమా అని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో బిఆర్ఎస్ పార్టీ ఆర్టీసీ కార్మికులకు అండగా నిలుస్తుందన్నారు. ఆర్టీసీ కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తే ఊరుకునేదిలేదని, ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హెచ్చరించారు. ఆయన వెంట బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెండె మధుతో పాటు ఆర్టీసీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ నిర్మాణ పనులకు శ్రీకారం

**ధూళిమిట్ట, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** రాష్ట్రంలో మొదటి విడతలో 4లక్షల 16వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు వరంగా నిలుస్తోందని జాలపల్లి గ్రామ సర్పంచ్ కమలాకర్ యాదవ్ తెలిపారు. గురువారం మండలంలోని జాలపల్లికి చెందిన షమీమ్ నసీర్ ఇందిరమ్మ ఇల్లు స్లాబ్ నిర్మాణం పనులను కమలాకర్‌యాదవ్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పరుశరామ్ గౌడ్, వార్డు సభ్యులు, పంచాయితీ కార్యదర్శి పున్న శ్రీనివాస్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సిబ్బితండాలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం

**ధూళిమిట్ట, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** హనుమతండ గ్రామపంచాయతీ పరిధిలోని సిబ్బితండాలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాన్ని సర్పంచ్ లలిత శ్రీనివాస్‌నాయక్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లలిత శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి సురక్షితమైన నివాసాన్ని అందించాలనే లక్ష్యంతో పనిచేస్తోందన్నారు. ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేద ప్రజలకు సొంత ఇల్లు కల సాకారం కావడం ఆనందకర విషయమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మోహన్ నాయక్, గ్రామ శాఖ అధ్యక్షులు జాటోత్ వినోద్ నాయక్, కార్యదర్శి స్వప్న, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వాసవి మాత జయంతిని ప్రభుత్వం నిర్వహించడం హర్షనీయం

**సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** వాసవీ మాత జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం పట్ల ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి గంప శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు అయిత రత్నాకర్, జిల్లా అధ్యక్షుడు తణుకు అంజనేయులు, ప్రధాన కార్యదర్శి సముద్రాల హరినాథ్, కోశాధికారి మాంకాల నవీన్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం వారు సిద్దిపేటలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్యుల కులదైవం లోకమాత శ్రీవాసవి మాత జయంతి అధికారికంగా జరపడం సంతోషంగా ఉందన్నారు. వాసవి మాత జయంతిని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్న సిఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## పేదల సంక్షేమమే కాంగ్రెస్ సర్కార్ ధ్యేయం

**సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వడంలో విఫలమైందని కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి రాగానే ఇందిరమ్మ పథకం ద్వారా ఇల్లు లేని ప్రతి పేదకు ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని ఆర్టీఏ జిల్లా సభ్యులు, డిసిసి ఓబిసి సెల్ చైర్మన్ డాక్టర్ లక్కరసు సూర్యచంద్రవర్మ, డిసిసి అధ్యక్షురాలు తూంకుంట అంక్షారెడ్డిలు అన్నారు. నారాయణరావుపేట మండలం గోపులాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవంతో పాటు పెద్దమ్మ పెద్దిరాజు కళ్యాణ మహోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. పెద్దమ్మ పెద్దిరాజుల దీవెనెలతో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మీసం నాగరాజు, మార్క సతీష్, నాయిని నర్సింహ్మారెడ్డి, కల్లూరి నర్సింలు, రాజు, దేవయ్య పాల్గొన్నారు.

## నాలుగో వార్డు అభివృద్ధికి కృషి : కౌన్సిలర్ శ్రీనివాస్

**గజ్వేల్, ఏప్రిల్ 23 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో నాలుగో వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నానని బిజెపి కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం ప్రజ్ఞాపూర్‌లోని బిజెపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చామన్నారు. దశల వారీగా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. సమస్యల పరిష్కారానికి 4వ వార్డులో బిజెపి కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని, ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రొట్టెల రాందాస్, శ్రీరామ్‌కృష్ణ, సల్ల శ్రీనివాస్, డాక్టర్ కదుల్ల ఎల్లేశం, ఎల్ల మధు, తలారి రాజు తదితరులు పాల్గొన్నారు.

## పేదల కలలను నిజం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

### సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

గత బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ పేరుతో పేదలను మోసం చేసిందని కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. గురువారం సిద్దిపేట రూరల్ మండలం తొర్నాల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను పార్టీ శ్రేణులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు అందించి వారి సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మాజీ మంత్రి హరీష్‌రావు పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు పేదల గృహ సమస్య ఎందుకు గుర్తు రాలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తూ పేదల ఆశలను నిజం చేస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రిక్కల మహేందర్‌రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా వైస్ చైర్మన్ కొత్తూరి నరహరి, గ్రామ శాఖ అధ్యక్షులు గూడ మహిపాల్, అంజిరెడ్డి, గుడారి మల్లారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజిరెడ్డి, స్వామి, బాబు, బొమ్మల యాదగిరి, ముద్దం లక్ష్మి, పూజాల గోపికృష్ణ, ఎర్ర మహేందర్, ఏరాబోలు రాజిరెడ్డి, వాహబ్, రషద్, ఎల్లు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అంతాయగూడలో గ్రాడ్యుయేషన్ డే

**జగదేవ్‌పూర్, ఏప్రిల్ 23 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని అంతాయగూడ గ్రామంలో గురువారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచ్ హేమ బాలమణి, కాంగ్రెస్ నాయకులు హేమసురేష్ హాజరై పిల్లలను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజగోపాల్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సంతోష, టీచర్ బాలమణి, వార్డు సభ్యులు మహేందర్, పోషమైన సురేష్, మంద ఉప్పలయ్య, కిష్టయ్య, తల్లిదండ్రులు లక్ష్మి, కుంట లక్ష్మి, జి.అఖిల, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

**మక్తమాసాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో...**

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 23 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని మక్తమాసాన్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. 5వ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు సిహెచ్.నందినికి ప్రథమ బహుమతి రూ.2వేలు, పి.వైష్ణవికి ద్వితీయ బహుమతి రూ.వెయ్యి నగదు బహుమతిని సర్పంచ్ ఫహీమ్, ఉపసర్పంచ్ వెంకటేష్‌గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.పద్మ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అంత్యక్రియల ఖర్చులకు గ్రామస్తుల ఆర్థిక సహాయం

**రాయపోల్, ఏప్రిల్ 23 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో గ్రామస్తులు మానవత్వం చాటుకున్నారు. ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందిన కిచ్చుగారి కనకయ్య అంత్యక్రియల ఖర్చుల కోసం గ్రామస్తులంతా కలిసి సహృదయంతో రూ.31వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఒకరికి ఒకరు తోడుగా నిలవడం సమాజపు బాధ్యత అని పేర్కొన్నారు. మృతునికి ఇద్దరు ఆడపిల్లలు కావడంతో ప్రభుత్వం ముందుకు వచ్చి ఆదుకోవాలని అన్నారు.

## యుపిఎస్ పాఠశాలలో కౌన్సిలర్‌కు సన్మానం

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 23 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని క్యాసారం గ్రామంలోగల యుపిఎస్ పాఠశాలలో కౌన్సిలర్ కప్ప మమత పోచయ్యను ఘనంగా సన్మానించారు. గురువారం విద్యార్థులకు ప్రొగ్రెస్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. సమాజంలో చదువుకుంటేనే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పొట్టి రవికుమార్, మాజీ ఏఎంసి డైరెక్టర్ ప్రవీణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కౌన్సిలర్ కప్ప మమత పోచయ్యను సన్మానిస్తున్న దృశ్యం

# రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు

## -26న అమ్మవారి కళ్యాణోత్సవం

**చౌటకూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన చౌటకూరులో కొలువుండి భక్తులచే నిత్యం పూజలందుకుంటున్న శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయ 4వ వార్షికోత్సవాలను ఈ నెల 25, 26వ తేదీలలో ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు, గౌడ సంఘం బాధ్యులు తగు ఏర్పాట్లు పూర్తిచేశారు. 24న గోపూజ, గణపతిపూజ, ఆవాహిత దేవతపూజ, లక్ష్మీగణపతి హవనము, అమ్మవారి గంగాతెప్పోత్సవం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. 26న శ్రీరేణుక ఎల్లమ్మ జమదగ్ని కళ్యాణమహోత్సవం, సాయంత్రం బోనాలు, ఆలయానికి చేరుకున్న భక్తులకు ప్రసాదవితరణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆలయ వార్షికోత్సవాలకు గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు, అత్తారింటికి వెళ్లిన గ్రామ ఆడపడుచులు తమ కుటుంబ సభ్యులతో గ్రామానికి చేరుకుని వార్షికోత్సవాల్లో పాల్గొని అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి తమ మొక్కుబడులు చెల్లించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కానున్నారు. వార్షికోత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాలు సందడిగా మారనున్నాయి.


వార్షికోత్సవానికి ముస్తాబవుతున్న శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం దృశ్యం

# జనగణనలో శిక్షణ సమయం మార్చండి

**కొల్చారం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
కొల్చారం మండల కేంద్రంలో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం ఎండకాలంలో తీవ్రమైన వేడి కారణంగా ఇబ్బందులు కలిగిస్తున్న నేపథ్యంలో, శిక్షణ సమయాన్ని ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు మార్చాలని సంఘాల ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. ఈ మేరకు కొల్చారం మండల తహసీల్దార్ శ్రీనివాస్‌చారికి టిపిటిఎఫ్, టిపియుఎస్, పిఆర్టీయు, యుటిఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో ప్రతినిధులు కలిసి తమ అభ్యర్థనను తెలియజేశారు. ఈకార్యక్రమంలో టిపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వి.సంగయ్య, వీరేందర్‌చారి, లక్ష్మీనారాయణ, పిఆర్టీయు బాధ్యులు శశాంక్, శ్రీరామ్, యుటిఎఫ్ బాధ్యులు బాబు, షాకీర్, ఉపాధ్యాయులు సిద్ధిరాములు, ఎల్లేశం, ప్రియాంక, బిందు, సరిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కి మెమోరాండం ఇస్తున్న దృశ్యం

## ప్రారంభమైన నల్లపోచమ్మ 7 వారాల జాతర

**మనూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని బోరంచ గ్రామంలో కొలువున్న శ్రీ నల్లపోచమ్మ ఆలయ 7 వారాల జాతర ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. 45 రోజుల పాటు కొనసాగేతే 7వారాల జాతర ఉత్సవాలను పురష్కరించుకుని గురువారరం ఆలయంలో ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి జాతర ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. 7 వారాల జాతర ఉత్సవాలకు తెలంగాణతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటూ ఉంటారు. ఆలయానికి ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుండటంతో ఎస్సై కోటేశ్వరరావు తన సిబ్బందితో ఆలయ పరిసరాల్లో ప్రత్యేన నిఘా ఏర్పాటు చేశారు. జాతర ఉత్సవాలకు చేరుకున్న భక్తులు ఆలయ అర్చకులు శ్రీకాంత్‌స్వామి, సిద్దుస్వామి, నాగయ్యస్వామి, ప్రవీణ్‌స్వామిలు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వమించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శేఖర్‌లు పాల్గొని భక్తులకు అసౌకర్యం కల్గకుండా తగు ఏర్పాట్లు చేశారు.

## భక్తుల సందడితో శ్రీకేతకి సంగమేశ్వర ఆలయం

**ఝరాసంగం/న్యాల్‌కల్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
గురువారం మండల కేంద్రమైన ఝరాసంగంలో పార్వతీదేవి సమేతంగా కొలువున్న శ్రీకేతకి సంగమేశ్వరస్వామి ఆలయం భక్తులసందడితో అలరారింది. ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు మండలానికి పక్కనే ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలనుంచి ప్రజలు తమ చిన్నారుల కేశఖండనం, నూతనంగా వివాహం చేసుకున్న కొత్త దంపతులు ఆలయానికి చేరుకుని ఆలయ అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా శుభకార్యాలను తమ కుటుంబసభ్యులు, బంధుమిత్రు లతో కలసి ఆనందోత్సాహాలతో చిన్నారుల సందడి మధ్య శోభాయమానంగా జరుపుకున్నారు. శుభ కార్యక్రమాలను పురస్కరించుకుని ప్రత్యేకంగా ఆలయ ఆవరణలో పిండివంటలు చేసుకుని పార్వతీదేవి సమేత సంగేశ్వరుడికి నైవేద్యా లు సమర్పించి బంధుమిత్రులతో కలసి సహపంక్తిభోజనాలు చేశారు.

## పంచాయతీ రికార్డులను పరిశీలించిన డిఎల్‌పిఓ

**మొగుడంపల్లి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన మొగుడంపల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం డిఎల్‌పిఓ అమృత మండల పరిధిలోని ధనాసిరి, జంగార్‌బౌలి, హర్చనాయక్, గొడిగార్‌పల్లి, మాడ్గి గ్రామపంచాయతీల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎల్‌పిఓ అమృత మాట్లాడుతూ 15వ ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్ నిధులు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల చెల్లింపులను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. గ్రామపంచాయతీల్లో నిర్వహిస్తున్న పనుల బిల్లులు, వోచర్లు, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని ఆమె పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ స్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఎప్పటికి అప్పుడు సమీక్షించి నిధులు వచ్చిన వెంటనే పనుల చెల్లింపులు పూర్తి చేయాలన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా అవసరమైన చోట్ల ఫైప్‌లైన్ మరమ్మతు పనులు చేయిం చాలని డిఎల్‌పిఓ అమృత సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ మహేష్, ఎంపిఓ సంజయ్‌కుమార్, ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో పోషకులు, ఉపాధ్యాయుల సమావేశం



గురుకుల పాఠశాలలో సమావేశం అయిన పోషకులు ఉపాధ్యాయులు

**మొగుడంపల్లి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన మొగుడంపల్లిలోని గిరిజన గురుకుల పాఠశాలలో గురువారం పోషకులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ హిమబిందు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. సమావేశానికి సర్పంచి రాజు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు ప్రోగ్రెస్‌కార్డులను పోషకలకు అందచేశారు. విద్యార్థుల చదువు, ప్రవర్తన, హాజరు తదితర అంశాలను పోషకులకు ఉపాధ్యాయులు వివరించారు. ప్రభుత్వ పాఠశాల్లోనే విద్యా ప్రమాణాలు మెరుగ్గా ఉన్నాయని ఉపాధ్యాయులు వివరించారు. వేసవి సెలవుల్లో తమ చిన్నారులపై పోషకులు ప్రత్యేకదృష్టి సారించాలని సర్పంచి, ఉపాధ్యాయులు పోషకులకు సూచించారు.

## దివ్యాన్షితను అభినందించిన మహేష్‌కుమార్‌గౌడ్

### -మలేషియాలో కరాటే పోటీల్లో వెండి పతకం



దివ్యాన్షితను అభినందిస్తున్న టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్

**మనూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
మలేషియాలో ఏప్రిల్ 16,17,18వ తేదీలలో జరిగిన సైలెంట్ నైట్ ఇంటర్‌నేషనల్ కరాటే పోటీలో హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యను అందుకుంటున్న మండల పరిధిలోని దవ్వూర్ గ్రామానికి చెందిన ఇట్టె దివ్యాన్షిత వెండి పతకాన్ని అందుకుందని కోచ్ నవీన్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. కరాటేపోటీలో వెండిపతకం సాధించిన దివ్యాన్షితను టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ట్రెయిన్ యువర్‌సెల్ఫ్ మర్టైల్ ఆర్ట్ అకాడమీలో శిక్షణ అందుకుంటున్న దివ్యాన్షిత స్కాట్‌ల్యాండ్‌లో జరిగే కామన్‌వెల్త్ క్రీడలకు అర్హతను సాధించినట్లు కోచ్ నవీన్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు.

## పోసానిపల్లిలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

**చౌటకూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని పోసానిపల్లిలో గ్రామానికి చెందిన మన్నె విజయలక్ష్మి నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంట్లో గురువారం గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. గృహప్రవేశ కార్యక్రమానికి ఎంపిడిఓ కె.శంకర్, గ్రామ సర్పంచి పల్లె రేణుకబాలరాజు, ఎంపిఓ సువర్ణ, పంచాయతీ కార్యదర్శి సుకన్య, ఉపసర్పంచి రమేష్‌లు హాజరై గృహప్రవేశం చేసి లబ్దిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.

# గుమ్మడిదలలో బిఆర్ఎస్ గర్జన

## -రేవంత్ రెడ్డి సర్కార్‌పై ఘాటు విమర్శలు

**గుమ్మడిదల, ఏప్రిల్ 23 (ప్రభాతవార్త):**
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశం రాజకీయంగా వేడెక్కింది. పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డి నాయకత్వంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రప్రభుత్వం, కాంగ్రెస్ నాయకులపై బిఆర్ఎస్ నేతలు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మున్సిపల్ చైర్మన్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ, 22వార్డుల్లో 15వార్డులను గెలుచుకుని బిఆర్ఎస్ తన బలాన్ని చాటిందన్నారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయాల మేరకు కోఆప్షన్ సభ్యులుగా ఎండి ఫయాజ్, సద్ది విజయభాస్కర్‌రెడ్డి, కళమ్మ, షేక్ నూర్జంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కుమార్‌గౌడ్ వెల్లడించారు. అలాగే గుమ్మడిదల–కానుకుంట రహదారి సమస్యకు త్వరలో పరిష్కారం లభించనుందని, రూ.7.5 కోట్లతో 8 కిలోమీటర్ల మేర 26 అడుగుల వెడల్పుతో తారు రహదారి పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఈసందర్భంగా బిఆర్ఎస్ మండల ఇన్‌చార్జ్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రవిమర్శలు చేశారు. మాటలకే పరిమితమైన ప్రభుత్వం అని, ఇచ్చినహామీల అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మాజీ సిఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అమలు చేసిన రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరాపెన్షన్, మిషన్‌భగీరథ, మిషన్‌కాకతీయ వంటి పథకాలే తెలంగాణ అభివృద్ధికి పునాది వేశాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులపై కూడా బిఆర్ఎస్‌నేతలు ఘాటువ్యాఖ్యలు చేశారు. గుమ్మడిదలలో కాంగ్రెస్ పేరు చెప్పినా ప్రజలు తిరగబడే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. కాటా శ్రీనివాస్ గౌడ్‌పై విమర్శలు చేస్తూ, ప్రజల కోసం పనిచేసిన చరిత్ర లేదని అన్నారు. రైతుల సమస్యలపై స్పందిస్తూ, గుమ్మడిదల 109 సర్వే నంబర్ భూముల విషయంలో ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆరోపించారు. అన్నారం 261 సర్వే నంబర్ భూముల విషయంలో కూడా ఇదేపరిస్థితి తీసుకురావాలని చూస్తున్నారని విమర్శించారు. టిజిఐఐసి చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డికి సవాల్ విసురుతూ, సంగారెడ్డిలో కూర్చొని మాట్లాడటంకాదు, గుమ్మడిదల 109 సర్వే నంబర్ వద్దకు వచ్చి రైతుల బాధలు చూడండి అని బిఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే రైతుల సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచులు, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు సురభి కుమార్‌గౌడ్, మురళి, చక్రపాణి, సంజీవరెడ్డి, కిషన్, సర్పంచి శ్రీను, నాయకులు దేవేందర్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, సత్తయ్య, హనుమంత్‌రెడ్డి, సత్యనారాయణ, వెంకట్రాంరెడ్డి, తుపాకుల రాజు, శ్రీనివాస్‌రెడ్డి, మహేష్, శేఖర్‌రెడ్డి, మురళి, పోచయ్య, యాదిరెడ్డి, సాయిరెడ్డి, గోపాల్, మహేష్, భార్గవ్‌విశాల్, శ్రీను, ప్రకాష్, దయానందలు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకుల దృశ్యం

## పట్టుదలకు మారుపేరు భగీరథుడు

### -గూడూరులో భగీరథుడి విగ్రహ ఆవిష్కరణ
### -జిల్లా సగరసంఘం ప్రధాన కార్యదర్శి వెంకటసాగర్


భగీరథుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వెంకట్‌సాగర్

**నాగల్‌గిద్ద, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని గూడూరులో ఏర్పాటు చేసిన భగీరథుడి విగ్రహాన్ని గురువారం జిల్లా సగరసంఘం ప్రధానకార్యదర్శి వెంకట్‌సాగర్ ఆవిష్కరించారు. విగ్రహ ఆవిష్కరణను పురస్కరించుకుని గ్రామానికి చెందిన మహిళలు నిండుకలశాలతో గ్రామంలోని పురవీధులగుండా ఊరేగింపుగా విగ్రహం వరకు చేరుకున్నారు. భగీరథ విగ్రహానికి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటసాగర్ మాట్లాడుతూ సగరులు(ఉప్పరులు) అన్నిరంగాల్లో (రాజకీయం, ఆర్థిక, విద్యాపరంగా) రాణించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నగర సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మంతుసాగర్, నగర బంధువులు తదితరులు పాల్గొన్నారు.

## నల్లపోచమ్మ ఆలయ ఆవరణలో హెల్త్ క్యాంప్

**మనూర్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని బోరంచగ్రామంలోని శ్రీనల్లపోచమ్మ ఆమ్మవారి 7 వారాల జాతరను పురస్కరించుకుని ఆలయ ఆవరణలో గురువారం సంగారెడ్డిలోని వెల్‌నెస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఫ్రీ మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. వైద్యశిబిరానికి చేరుకున్నవారికి షుగర్ టెస్ట్, బిపి చెకప్ తదితర పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆలయ ఆవరణలో 7 వారాలు పాటు ప్రతి గురువారం మెడికల్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి బాధ్యులు, శ్రీనల్లపోచమ్మ ఆలయ ట్రస్టు బాధ్యులు సూచించారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన మాజీ కార్పొరేటర్

**రామచంద్రాపురం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని భారతీనగర్ డివిజన్ పరిధిలోని పాత ఎంఐజి కాలనీలో భాస్కర్‌ముదిరాజ్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ కార్పొరేటర్ వెన్నవరం సింధూఆదర్శ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి మాట్లాడుతూ, వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజల, ప్రయాణికుల దప్పిక తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటుచేయడం అభినందనీయమని నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీని నిర్వీర్యం చేస్తే చూస్తూ ఊరుకోం

## -కార్మికులకు అండగా ఉంటాం
## -బిఆర్టీయు రాష్ట్ర నాయకులు రాంబాబు, యాదగిరియాదవ్

**రామచంద్రాపురం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్టీసీని నిర్వీర్యం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని, కార్మికులకు అండగా నిలుస్తామని బిఆర్టీయు రాష్ట్ర నాయకులు రాంబాబుయాదవ్, కార్యదర్శి యాదగిరియాదవ్‌లు అన్నారు. గురువారం రామచంద్రాపురం పట్టణంలోని బిహెచ్ఈఎల్ డిపో ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెలకు మద్దతు ప్రకటించి ప్రసంగించారు. ఈ సందర్భంగా రాంబాబు యాదవ్, యాదగిరియాదవ్‌లు మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ చేసిన హామీలను నెరవేర్చాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. ఆర్టీసీని ప్రైవేటు పరం చేసి కార్మికులకు అన్యాయం చేస్తే ఎలా గమ్మున ఉంటామన్నారు. కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో చేసిన హామీలను కార్మికులు అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారని, ఆర్టీసీని ప్రభుత్వ సంస్థగా విలీనం చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్లు ఉండాలని గతంలో చెప్పిన రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం యూనియన్లను పునర్ వ్యవస్థీకరించాలని హితవు పలికారు.



ఆర్టీసి కార్మికుల సమ్మెకు మద్దతు ప్రకటిస్తున్న బిఆర్టీయు నాయకులు

## బోరపట్లకుంట సర్వే చేపట్టిన అధికారులు


సర్వే నిర్వహిస్తున్న అధికారులు

**హత్నూర, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
హత్నూర మండలం బోరపట్ల గ్రామపరిధిలోని నారటికుంట శిఖంను రెవెన్యూ ఇరిగేషన్ అధికారుల సంయుక్త సర్వేను గురువారం నిర్వహించారు. కుంట శిఖం అక్రమాలకు గురైందని ఫిర్యాదులు రావడంతో జాయింట్ సర్వే నిర్వహించినట్లు హత్నూర తహసీల్దార్ ఫర్వీన్ షేక్ తెలిపారు. సర్వేలో డిప్యూటీ తహసీల్దార్ కరుణాకర్‌రావు, ఇరిగేషన్ ఎఇ శ్రీకాంత్ తదితరులు, సర్వే శాఖ ఇరిగేషన్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలకు నిజాలు చెప్పండి

### -కానుకుంట–గుమ్మడిదల డబుల్ రోడ్డుకు నిధులు
### -క్రెడిట్‌పై బిఆర్ఎస్ డబ్బాలు: పుట్ట నర్సింగరావు ఫైర్

**గుమ్మడిదల, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
ఎన్నో ఏళ్లుగా అధ్వాన్నంగా ఉన్న కానుకుంట–గుమ్మడిదల ప్రధాన రహదారి సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపడంతో స్థానిక ప్రజల్లో ఆనందం నెలకొంది. ఈ రహదారిని డబుల్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు రూ.7.20 లక్షల నిధులు మంజూరు చేయడం హర్షణీయమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగరావు అన్నారు. అయితే, ఈ నిధుల మంజూరుపై బిఆర్ఎస్ నేతలు మేమే చేయించాం అంటూ డబ్బాలు కొడుతున్నారని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ప్రజలకు నిజాలు తెలుసునని, అధికారంలో ఉన్నప్పుడు ఈ రహదారిని పట్టించుకోని బిఆర్ఎస్ నాయకులు ఇప్పుడు క్రెడిట్ కోసం పోటీ పడటం హాస్యాస్పదమని విమర్శించారు. ఏళ్ల తరబడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పుడు బిఆర్ఎస్ నాయకులు ఎక్కడున్నారు? ఇప్పుడు ప్రభుత్వం పని చేస్తే దానికి తామే కారణమంటూ ప్రచారం చేయడం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నమే అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రజా పాలన ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి దామోదర్ రాజనరసింహ, జిల్లా ఇన్చార్జిమంత్రి వివేక్ వెంకటస్వామి, నియోజకవర్గ ఇన్చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్‌ల కృషితోనే ఈ రహదారికి నిధులు మంజూరయ్యాయని స్పష్టం చేశారు. ఇందుకు స్థానిక ప్రజల తరపున వారికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభమై రహదారి అభివృద్ధి పూర్తయితే గ్రామాలమధ్య రాకపోకలు సులభమవుతాయని, వ్యాపార కార్యకలాపాలు, అత్యవసర సేవలు మెరుగుపడతాయని ఆయన చెప్పారు. గుమ్మడిదల మండల అభివృద్ధికి ఈ రహదారి కీలకంగా మారుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

## అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

### -36వ వార్డు కౌన్సిలర్ అప్పం శ్రవణ్‌కుమార్


కార్యక్రమంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ అప్పం శ్రవణ్‌కుమార్

**జహీరాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
బాలింతలు, చిన్నారులు అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ 36వ వార్డు కౌన్సిలర్ అప్పం శ్రవణ్‌కుమార్ సూచించారు. గురువారం మున్సిపల్ పరిధిలోని శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణపక్షంలో భాగంగా గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నో స్క్రీన్ అవర్, ఫ్యామిలీ ప్లేయర్ టైం గురించి తల్లులు, పిల్లలకు సిడిపిఓ సుశీల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కౌన్సిలర్ శ్రవణ్‌కుమార్ చిన్నారులు ప్రదర్శించిన ప్రదర్శనలను వీక్షించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.సునీత, శాంతినగర్, ఐడిఎస్ఎంటి కాలనీ, సంతోషినగర్, వద్దెరగూడ అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

## -పిసి గోష్ రిపోర్టు కాదది-పిసిసి రిపోర్టు
## -ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**
బిఆర్ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం జస్టిస్ పిసి ఘోష్ ఇచ్చిన రిపోర్టుపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టులాంటిదని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై హైకోర్టు తీర్పుతో మాజీ సిఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, మాజీమంత్రి తన్నీరు హరీష్‌రావులతో పాటు బిఆర్ఎస్ పార్టీకి నైతికవిజయం అందించిందన్నారు. సాగు, తాగు నీరు అందించేందుకు చేపట్టిన ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ మాయ మాటలతో రైతులను మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టులో కేవలం రెండు పిల్లర్లు కుంగిపోగా వాటికి మరమ్మతులు చేసి రైతులకు నీరు అందించాల్సిందిపోయి బిఆర్ఎస్‌పై బురద జల్లే ప్రయత్నం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రా పేరుతో పేద ప్రజల ఇళ్లను కూలగొట్టి బజారుపాలు చేస్తోందన్నారు. మూసీ సుందరీకరణ పేరుతో పేద ప్రజల ఇళ్లను కూలగొడుతూ బడాబాబులకు మేలు చేసేలా ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.గుండప్ప, జహీరాబాద్, కోహీర్ మండలాల బిఆర్ఎస్ అధ్యక్షులు తట్టు నారాయణ, కె.నర్సింలు, ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షులు బండి మోహన్, పట్టణ మాజీ అధ్యక్షులు యాకూబ్, మున్సిపల్ కౌన్సిలర్లు గౌస్ గౌరీ, దీపక్, విశ్వేశ్వర్, ప్రవీణ్, సర్పంచులు మచ్చేందర్, మోహన్ రాథోడ్, భీమ్‌రావు నాయక్, బాల్‌రాజ్, దేశెట్టి పాటిల్ పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు